Sakshi Dt 03/10/17.

హైదరాబాద్ | మంగళవారం | అక్టోబర్ | 3 | 2017 సాక్షి

# ప్రమాదరహితంగా మెట్రో స్టేషన్లు

- ముంబయి దుర్ఘటన నుంచి పాఠాలు
- మియాపూర్–అమీర్‌పేట్ రూట్లో పలు భద్రతా చర్యలకు ఆదేశం
- హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



మెట్రో స్టేషన్ల వద్ద పనులను పరిశీలిస్తున్న హెచ్ఎంఆర్ ఎండీఎన్వీఎస్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ముంబయి సబర్బన్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల మధ్య తొక్కిసలాట దుర్ఘటన జరిగిన నేపథ్యంలో మెట్రో స్టేషన్‌లను ప్రమాద రహితంగా తీర్చిదిద్దేందుకు పలుభద్రతా చర్యలు చేపట్టినట్లు హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇతర ఉన్నతాధికారులతో కలిసి మియాపూర్–ఎస్.ఆర్.నగర్(13 కి.మీ)మార్గంలో విస్తృతంగా పర్యటించారు. భారీవర్షాలు, వర్షాదినాలు, ప్రత్యేక రోజుల్లో మెట్రోస్టేషన్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు రాకపోకలు సాగించినపుడు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. మెట్రోస్టేషన్లకు సమీపంలోని పాదచారుల మార్గాలను(ఫుట్‌పాత్) ప్రస్తుతం ఉన్నదానికంటే 15 నుంచి 20 అడుగులు వెడల్పు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన ఆస్తులను సేకరించాలని స్పష్టం చేశారు. ముఖ్యమైన స్టేషన్ల వద్ద ఆకాశమార్గాలను తక్షణం ఏర్పాటుచేయాలని సూచించారు. స్టేషన్‌ల సమీపంలో నిర్మాణ వ్యర్థాలను తక్షణం తొలగించాలని ఆదేశించారు.

## స్టేషన్లకు సమీపంలో 700 మీటర్ల స్థలంలో సుందరీకరణ..

గ్రేటర్ నగర పునర్నిర్మాణానికి దోహదం చేయనున్న మెట్రో ప్రాజెక్టులో సుందరీకరణ పనులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎండీ తెలిపారు. ప్రతి స్టేషన్ వద్ద 700 మీటర్ల ప్రాంతాన్ని మూడు జోన్లుగా విభజించనున్నామన్నారు. ఇందులో ప్రధానంగా స్టేషన్ ఉండే 220 మీటర్ల ప్రాంతాన్ని(జోన్–బి)గా పరిగణిస్తామని..నవంబరులోగా ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు పూర్తికావాలన్నారు. స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ కేంద్రాల వద్ద రెయిలింగ్ పనులను తక్షణం పూర్తిచేయాలని ఆదేశించారు. స్టేషన్ల వద్ద బస్‌బేలు, ఆటోబేలు, ఈ వెహికిల్ బేలు ఏర్పాటుచేయనున్నామన్నారు. మెట్రో స్టేషన్ల లోపలిభాగంలో రెండు చివరల్లో టాయిలెట్స్ ఏర్పాటుచేశామన్నారు. భూగర్భవిద్యుదీకరణ, స్టేషన్ల సుందరీకరణ పనులను వేగవంతంచేయాలని ఆదేశించారు.

- భద్రత పరంగా మియాపూర్–అమీర్‌పేట్ మార్గంలో చేపట్టనున్న పనులివే..
- అమీర్‌పేట్ ఇంటర్‌ఛేంజ్ స్టేషన్ వద్ద(సారథి స్టూడియోవద్ద) ప్రయాణికులు ఇబ్బంది పడకుండా పాదచారుల మార్గాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడున్న నాలాపై శ్లాబ్ విస్తీర్ణాన్ని పెంచాలి. స్టేషన్ ఎడమవైపున ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలి.
- ఎస్.ఆర్.నగర్ స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌లపై సుందరీకరణ పనులు చేపట్టాలి.
- ఎర్రగడ్డ స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌లు ఏర్పాటుచేయాలి.ఇక్కడున్న ఓపెన్‌నాలాకు రక్షణకవచంగా గ్రిల్స్ ఏర్పాటుచేయాలి. భారీ వర్షాలు కురిసినపుడు వరదనీరు ఈ స్టేషన్ సమీపంలో ముంచెత్తకుండా చర్యలు చేపట్టాలి.
- మూసాపేట్ స్టేషన్‌కు సమీపంలో ఉన్న శ్మశానవాటిక సమీపంలో సుందరీకరణ పనులు చేపట్టాలి. ఇక్కడున్న విద్యుత్‌స్తంభాలను తొలగించాలి.
- బాలానగర్ స్టేషన్ వద్ద అక్రమనిర్మాణాలు తొలగించాలి. సర్వీసు రోడ్డును విస్తరించాలి.
- కూకట్‌పల్లి స్టేషన్ పనులను తక్షణం పూర్తిచేయాలి. ఇక్కడి సర్వీసురోడ్డును మరింత విస్తరించేందుకు ఆస్తులను సేకరించాలి.
- కెపిహెచ్‌బి స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించాలి.
- జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ వద్ద ఆక్రమణలు తొలగించాలి. విద్యుదీకరణ పనులను వేగవంతంచేయాలి. సర్వీసురోడ్డును మరింత వెడెల్పుచేయాలి.
- మియాపూర్ టర్మినల్ స్టేషన్ వద్ద ప్రజోపయోగానికి 3 లక్షల చదరపు అడుగుల సువిశాల విస్తీర్ణంలో పలు సౌకర్యాలు కల్పించాలి. స్టేషన్‌కు కుడిభాగంలో ఉన్న సర్వీసురోడ్డును పలు వరుసల దారులుగా విస్తరించాలి. ఫుట్‌పాత్‌లపైకి వాహనాలు రాకుండా అవసరమైన ఏర్పాట్లుచేయాలి.